అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34(ఆదివారం)
కనిష్ఠం : 28

అయినవిల్లి సిద్ధివినాయకునికి రూ.30లక్షల విలువైన పాదుకలు 5
బాలికపై పలుమార్లు వృద్ధుడి అత్యాచారం



ల్యాబ్‌ల.. చీటింగ్!

రాజమహేంద్రవరానికి చెందిన ధీరజ్‌కు జ్వరం రావడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు.. డాక్టర్ ఏమిటి సమస్య అని అడిగి సుమారు 10కి పైనే టెస్ట్‌లు రాశాడు.. అది చూసి ధీరజ్ ఆశ్చర్యపోయాడు.. ఇవన్నీ చేయించాలా సార్ అని అడిగాడు.. అందుకే రాసిచ్చింది అంటూ డాక్టర్ సీరియస్ అయ్యాడు.. ధీరజ్ టెస్ట్‌లన్నీ చేయించుకున్నాడు. అంతా బాగానే ఉందని రిపోర్టు వచ్చింది.. ఆ రిపోర్టు చూసి డాక్టర్ బాగానే ఉందని చెప్పి పంపించాడు.. దీనికి ఖర్చెంతయ్యిందో తెలుసా.. అక్షరాలా రూ.5 వేలు.. గతంలో అయితే నాడి పట్టుకుని చూసి రోగం ఏంటో చెప్పేవారు.. మరి నేడు వైద్య వృత్తి వ్యాపారంగా మారిపోయింది. టెస్ట్ చేయించనిదే రోగమేంటో చెప్పలేని దుస్థితిలో వైద్యులు తయారయ్యారు.. ఎందుకంటే వైద్యులకు డబ్బు జబ్బు పట్టుకుంది. ల్యాబ్ ఒక టెస్ట్ రాస్తే.. ఫీజు రూ.100 అనుకుంటే.. డాక్టర్‌కు రూ.60.. ల్యాబ్‌కు రూ.40.. దీంతో ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి.

ఒక మహిళకు సైనసైటిస్ ఉందని వైద్యుడు సీటీ స్కానింగ్ రాశారు. ఆ సీటీ స్కానింగ్ చేయించుకొని ఆ వైద్యుడి వద్దకు వెళితే మందులిచ్చారు. కానీ తగ్గుము ఖం పట్టలేదు. దీంతో ఆమె మరో వైద్యుడి వద్దకు వెళ్లారు. అక్కడ స్కానింగ్ ఫిల్మ్ చూసిన డాక్టర్.. అసలు వ్యాధి సైనసైటిస్ కాదని అనుమానించి మరో సారి స్కానింగ్ రాశారు. దీనిని మరో ల్యాబ్‌లో చేయించు కోగా కణితి ఉందని రిపోర్టులో రాశారు. బయాప్సీ చేయగా నాసో ఫరింజల్ కార్సినోమా(క్యాన్సర్) అని తేలింది. ముందు స్కానింగ్‌కీ, రెండో స్కానింగ్‌కీ మధ్య నెల గడిచిపోయింది. దీంతో క్యాన్సర్ రెండో స్టేజికి వెళ్లిపోయింది. అదే ముందు స్కానింగ్ రిపోర్టులోనే గుర్తించి ఉంటే.. మరి దీనికి బాధ్యులు ఎవరు?.. ఈ ఒక్క ఉదాహరణ చాలు.. ప్రైవేటు ల్యాబ్‌లు ప్రజల ప్రాణాలతో ఎలా ఆడుకుంటున్నాయో తెలియడానికి!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు ల్యాబ్‌లో పరీక్ష చేయించాలంటే రోగులకు అనవసరపు ఖర్చు ఎందుకా అని వైద్యులు ఆలోచించేవారు.. నేడు కోట్లు ఖర్చు పెట్టి చదువుతున్నారు..ఆ జాలి లేదు. దయ లేదు..ఎంత వస్తే అంత రానీ అంతే. ప్రస్తుతం ఎలా ఉందంటే జ్వరం వచ్చిందా?.. టెస్టులు చేయించేయండి. తలపోటా? ఎందుకైనా మంచిది సీటీ స్కాన్ చేయించేద్దాం. ఇలా రోగుల భయాన్నే పెట్టుబడిగా పెట్టి మెడికల్ ల్యాబ్‌లు దందా సాగిస్తున్నాయి. దీంతో ప్రైవేటు ల్యాబ్‌ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉదాహరణకు షుగర్(మధుమేహం) టెస్టు చేయాలంటే ల్యాబ్‌లకు రూ.20 ఖర్చవుతుంది. కానీ రూ.150 వరకూ లాగేస్తున్నారు. ఇదిలా ఉంటే.. చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు నిర్ధారణ జరుగుతోందనే ఆరోపణలున్నాయి.. అధికారులు మాత్రం మామూళ్లు చేజారిపోతాయనే భయంతో తనిఖీలకు జంకుతున్నారు. కొన్ని ల్యాబ్‌లలో అనధికారికంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం.

జిల్లాలో 350 ల్యాబ్‌లు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చిన్న, పెద్ద ల్యాబ్‌లు 350 వరకూ ఉన్నాయి. ఇవి రిజస్ట్రేషన్ అయినవి..ఏ అనుమతులూ లేకుండా నడుస్తున్నవి మరో అన్ని ఉంటాయి. దాదాపుగా అన్ని ల్యాబ్‌ల వాళ్లకూ డాక్టర్లతో కనెక్షన్ ఉంటోంది. దీంతో అవసరం లేకపోయినా వైద్య పరీక్షలు రాస్తున్నారు. ల్యాబ్ పేరుతో ఉన్న చీటీపైనే వైద్యుడు ఏమి పరీక్షలు కావాలో రాస్తాడు. దీంతో అదే ల్యాబ్‌కి వెళ్లాల్సి వస్తోంది. అక్కడి ఎంత మొత్తం అడిగితే అంతా జమ చేయాల్సిందే. ఒక వైద్యుడు రాయగా టెస్టులు చేయించుకొని.. ఆ రిపోర్టులను మరో వైద్యుడికి చూపిస్తే.. అబ్బే అవి పని చేయవంటూ మళ్లీ మొదటి నుంచీ అన్ని టెస్టులూ రాస్తున్నారు.దీంతో మళ్లీ వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. సాధారణ జలుబుకు సైతం చాంతాడంత వైద్య పరీక్షల జాబితా ఇస్తున్నారు.ఎందుకంటే ల్యాబ్‌లు వసూలు చేసే సొమ్ముల్లో గరిష్ఠంగా 60 శాతం వరకూ వైద్యుల కమిషన్ ఉం టోందని చెబుతున్నారు.ఆర్ఎంపీ తీసుకెళితే 30 శాతం వరకూ ముడుతోందట. కార్పొరేట్ ఆస్పత్రుల్లో డాక్టర్లకు టార్గెట్‌లు విధించడంతో విధిలేని పరిస్థితుల్లో కొందరు వైద్యులు ఎడా పెడా వైద్య పరీక్షలు రాస్తున్నారని చెబుతున్నారు.

డాక్టర్ల చీటీతో..ల్యాబ్‌ల దోపిడీ

- జ్వరమని వెళ్లినా పరీక్షే
- నాడి పట్టుకోకుండానే చీటి
- టెస్ట్ రిపోర్టు వస్తేనే వైద్యం
- రోగుల జేబులు ఖాళీ
- ఉమ్మడి జిల్లాలో 350 ల్యాబ్‌లు
- అనుమతిలేనివి డబుల్
- వైద్యాధికారులకు మామూళ్లు
- ఎక్కడా కానరాని ధరల పట్టికలు
- తనిఖీలు చేయని వైనం

కానరాని ఫీజు బోర్డులు..

మెడికల్ ల్యాబొరేటరీల్లో ఆయా వైద్య పరీక్షలకు సంబంధించి ధరల పట్టికలు ఉండాలి. కానీ అధిక శాతం ల్యాబ్‌లలో అవి కానరావు. ఒకవేళ పెడుతున్నా అవి ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవాల్సిందే.. లేదంటే చాలా చిన్న అక్షరాలతో ఉంటున్నాయి. రోగులు ధరలపై ప్రశ్నించే అవకాశమే ఉండదు. ఇదే అదునుగా ఇష్టానుసారం ధరలను పిండేస్తున్నారు. ఒకే రకం టెస్టుకు ఒక ల్యాబ్‌కి మరో ల్యాబ్‌కి సంబంధం ఉండడం లేదు. తూర్పు గోదావరిలో 107, కాకినాడ జిల్లాలో 115, కోనసీమ జిల్లాలో మరో వంద వరకూ ల్యాబ్‌లకు ప్రభుత్వ అనుమ తులున్నాయి. అనుమతులు లేనిల్యాబ్‌లు మరో అన్ని ఉంటాయి. దాదాపు అన్ని ల్యాబ్‌లలోనూ ధరల దందా కొనసాగుతూనే ఉంది. ఉదాహరణకు క్యాన్సర్ నిర్ధారణకు తప్పని సరిగా చేసే పెట్ స్కానింగ్‌కి రూ.25 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇదే స్కానింగ్‌ని తక్కువ ధరకూ చేసే వీలుందని చెబుతున్నారు. ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో పెద్ద ల్యాబ్‌లు ఎన్నో రకాల రాయితీలను ప్రకటిస్తున్నాయి. 10 శాతం నుంచి ఏకంగా 70 శాతం వరకూ రాయితీలను ప్రకటిస్తున్నాయంటే ఏ స్థాయిలో దోపిడీ జరుగు తుందో అర్థం చేసుకోవచ్చు. వైద్యులు వ్యాధి నిర్ధారణకు ల్యాబ్‌ల టెస్టులపైనే ఎందుకు పూర్తిగా ఆధారపడిపోతున్నారో అనే ప్రశ్నలకు సహేతుకమైన జవాబు శూన్యమే.



అధికారులకు మామూళ్లు..

ల్యాబ్‌లను నియంత్రించే అధికారం ఉన్న అధికారులు 'ఎందుకనో' తనిఖీల ఊసెత్తడం లేదు. సాధారణంగా ల్యాబ్‌లు ఐదేళ్లకు ఒకసారి లైసెన్సు రెన్యువల్ చేయించుకోవాలి. లైసెన్సు రెన్యువల్‌కి దరఖాస్తు సదరు అధికారి టేబు ల్‌పైకి వెళ్లినప్పుడు మాత్రమే తనిఖీ కాదు..పరిశీలన చేస్తున్నారు. అది కూడా తూతూ మంత్రంగానే జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.లైసెన్సు ఇచ్చిన తర్వాత ఐదేళ్ల పాటు ఆ ల్యాబ్ దరిదాపుల్లోకి అధికారులు వెళ్లకపోవడంతో చాలా ల్యాబ్‌లలో సదుపాయాలు,అవసరమైన యంత్ర పరికరాలు ఉండక పోయినా నడిపించేస్తున్నారు. అసలు ల్యాబ్‌లో అందుబాటులో లేని వైద్య పరీక్షలు బోర్డుల్లో దర్శనమిస్తుంటాయి. రోగి వెళ్లిన తర్వాత ఆ వైద్య పరీక్షలకు నమూనాను హైదరాబాద్, పుణె, ఢిల్లీ పంపిం చాలంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. కానీ చాలా మటుకు ఊళ్లోనే చక్కబెడుతున్నారు.



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద నిర్మాణంలో ఉన్న హైవే ఫ్లైఓవర్ ఏడాదిన్నరకాలంగా ఇలానే..

అక్కడయింది.. ఇక్కడవ్వదే?

- జొన్నాడ వద్ద ముందుకు సాగని ఫ్లైఓవర్ నిర్మాణ పనులు
- ఇప్పటికే పూర్తయి ప్రారంభమైన మోరంపూడి ఫ్లైఓవర్
- 216(ఏ) హైవేపై ట్రాఫిక్ దృష్ట్యా రెండు నిర్మాణాలు ఒకేసారి ప్రారంభం
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షలు చేసినా పనుల్లో తీవ్ర జాప్యం
- ప్రమాదాలకు నిలయంగా జొన్నాడ సెంటర్
- పట్టించుకోని హైవే అధికారులు

ఆలమూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలన్న సదుద్దేశంతో ప్రారంభించిన జొన్నాడఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో జాప్యంకారణంగా నత్తనడక నడుస్తోంది. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు ప్రారంభిస్తే ఒకటే పూర్తయింది

హైవేపై పెరిగిన ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారి 216(ఏ)లో రాజమహేంద్రవరంలోని మోరంపూడి, ఆలమూరు మండలంలోని జొన్నాడవద్ద ఫ్లైఓవర్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. రాజమహేంద్రవరంవద్ద ఫ్లైఓవర్ ఏడాది క్రితమే అందుబాటులోకి వచ్చింది. కానీ, జొన్నాడలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా సాగుతోంది. ఏడాదిపాటు పనులు నిలుపుదల చేశారు. ఇటీవలకాలంలో పనులు మొదలుపెట్టి తూతూమంత్రంగా ఒక మిషన్‌తో ర్యాంపు పనులు చేస్తున్నారు. ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు కాంట్రాక్టు సంస్థ శృతి కంపెనీ ప్రతినిధులతో సమీక్షలు చేసినప్పటికీ పనుల్లో వేగం కనిపించడంలేదు. కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ మోరంపూడి, జొన్నాడవద్ద ఫ్లైఓవర్ నిర్మాణాలకు 2023, జనవరిలో శంకుస్థాపనలు చేశారు. అప్పటికి వచ్చేఏడాది అంటే 2024, జనవరికి పనులు పూర్తి చేసి ఫ్లైఓవర్‌లు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. మోరంపూడివద్ద ఫ్లైఓవర్ ఇంచుమించులో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. కానీ, జొన్నాడ వద్ద మాత్రం 2023, మార్చిలో పనులు ప్రారంభించి పనులు నత్తనడకన చేస్తున్నారు. ఏడాదికాలంపాటు పనులు నిలిపివేశారు. కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ హైవే అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమీక్షలు చేశారు. సమీక్ష చేసిన ప్రతిసారి ఈ నెలలో మొదలు పెడతామని మభ్యపెడుతున్నారు. ఇటీవల జరిపిన సమీక్షలో ఇచ్చిన హామీ మేరకు పనులు చేస్తున్నట్లు చెప్పి కాలక్షేపం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ప్రమాదాలు

జొన్నాడవద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో రెండున్నరేళ్లుగా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఫ్లైఓవర్ పనుల పేరుతో ఎటువంటి నియమ, నిబంధనలు పాటించకుండా వదిలేయడంతో తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పనులు ప్రారంభించిన తర్వాత పలు ప్రమాదాలు జరిగి కొందరు మృత్యువాత పడగా అనేకమంది గాయాలపాలవుతున్నారు. హైవే అధికారులు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదు. దీంతో రోడ్డు ఒకపక్క నుంచి మరో పక్కకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేస్తున్నామనే విధానం తప్ప వేగవంతం చేయడం లేదు. పనులు ప్రారంభించి పిల్లర్స్ నిర్మాణానికే దాదాపుగా ఏడాదికాలం పట్టిందంటే ఎంత నత్తనడకగా పనులు సాగుతున్నాయో అర్థమవుతోంది.

బస్సు ప్రయాణికులకు నరకయాతన

ఆలమూరు మండలంలో అనేక గ్రామాల వారికి జొన్నాడ సెంటర్ ప్రధాన కూడలిగా ఉంది. పలు గ్రామాల వారు ఇక్కడికి చేరుకునే రాజమహేంద్రవరానికి ప్రయాణం చేస్తుంటారు. ఫ్లైఓవర్ పనులతో 28నెలలుగా బస్సు షెల్టర్లు పూర్తిగా తొలగించి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ఎటువంటి సౌకర్యాలు లేకపోగా ఎండైనా.. వానైనా.. బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులతో బస్సులు ఎక్కడ ఆపుతారో అర్థంకాక వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జొన్నాడ సెంటర్‌లో ఇంత దయనీయ పరిస్థితి ఉన్నప్పటికీ హైవే అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించి ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు..

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ఇరువైపులా నిర్మించిన సర్వీసురోడ్లు ఏడాదికాలంలో కనీసం గోతులు కూడా పూడ్చలేదు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. హైవే కావడంతో అనేక భారీ వాహనాల రాకపోకలతో మరింత ఇబ్బందిగా మారినా కాంట్రాక్టు సంస్థగానీ, హైవే అధికారులుగానీ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. నిత్యం దుమ్ము లేచిపోవడంతో వాహనదారులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వీసురోడ్ల దుస్థితిని గుర్తించి తక్షణం ఈ రోడ్లను మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.



ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణంవద్ద అధ్వానంగా ఉన్న హైవే రోడ్ల దుస్థితి



పి.గన్నవరం పాత అక్విడెక్టుపై గోదావరి వైపు గోడల వెంబడి రావిచెట్లు...



రాత్రిళ్లు తాగి పాడేసిన మద్యం సీసాలు

అక్విడెక్టుల పర్యవేక్షణ ఏదీ?

- సమస్యల వలయంలో పి.గన్నవరం అక్విడెక్టులు
- చెట్లు, తుప్పలతో పాత అక్విడెక్టు.. చీకట్లో కొత్త అక్విడెక్టు
- నిర్వహణ నిధులు లేకపోవడంతో అధ్వాన పరిస్థితులు

పి.గన్నవరం, మే 18(ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు సర్‌ఆర్థర్ కాటన్ మహాశయుడు నిర్మించిన పి.గన్నవరం పాతఅక్విడెక్టు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఒకప్పుడు దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రజాప్రతినిధులు ప్రకటనలు గుప్పించారు.కానీ, ఇక్కడ కాల్వతొట్టిలో పందులు స్వైరవిహారం చేయడంతోపాటు అక్విడెక్టుకు ఇరువైపులా రావి చెట్లు రక్షణ గోడలను చీల్చుకుని దట్టంగా పెరిగిపోతున్నాయి. అక్విడెక్టుపై మందుబాబులు మద్యంసేవించి సీసాలు బద్దలు కొట్టడంతో బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు.

మహోన్నత ఆశయంతో నిర్మాణం..

పవిత్ర గోదావరినదీ తీరంపై నాడు రాజోలు దీవికి సాగునీరందించడం, సరుకులు రవాణాకు వాహనాల రాకపోకలు నిమిత్తం పంట కాలువ తొట్టితోపాటు కాటన్ అక్విడెక్టును నిర్మించారు. 2014, మార్చిలో ఓఎన్‌జీసీ నిధులతో టూరిజం అభివృద్ధి పథకం పేరిట కొంతమేర ప్రత్యేక సెట్టింగ్‌తో కూడిన సిమెంటుబల్లలు ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబులు సిమెంటు బల్లలను కూల్చి అస్తవ్యస్తంగామార్చేశారు. వర్షంపడితే అక్విడెక్టుపై నీరు నిలిచి ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా మారుతోంది.

విద్యుదీకరణ మున్నాళ్ల ముచ్చటే..

అక్విడెక్టుపై విద్యుదీకరణ మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. పదిరోజులు కూడా లైట్లు వెలగని పరిస్థితి నెలకొంది. వైసీపీ హయాంలో హడావిడి చేసి లైట్లకు మరమ్మతులు నిర్వహించి అప్పటి ఎమ్మెల్యే అట్టహాసంగా లైట్లు ప్రారంభించారు. అవి కూడా ప్రారంభం రోజున తప్ప మరునాడు వెలగలేదు. లైట్లు లేకపోవంతో రాత్రిపూట ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అక్విడెక్టుపై భారీగా గోతులు పడడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు అభివృద్ధి పనుల్లో గుంతలకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. గతప్రభుత్వహయాంలో కనీసం నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయని పలువురు వాపోతున్నారు.

తాజాగా కలెక్టర్‌కు ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొత్త, పాత అక్విడెక్టులను స్వయంగా పరిశీలించారు. కొత్త అక్విడెక్టు కాల్వతొట్టెపై అసంపూర్తిగా నిలిచిన రైలింగ్, విద్యుదీకరణ, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.కోటి అంచనాలతో ప్రతిపాదనలు కలెక్టర్‌కు అందించారు. ఈ నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పి.గన్నవరం కొత్త అక్విడెక్టుపై అలంకారప్రాయంగా ఉన్న లైట్లు

నగరం జీసీఎస్ వద్ద జనరేటర్‌లో మంటలు
- మంటలను అదుపు చేసిన ఓఎన్జీసీ సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం
5

మలికిపురంలో తిరంగా యాత్ర



పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా.. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్థాన్‌పై మన దేశ త్రివిధ దళాలు ఉమ్మడిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావ డం.. మన దేశ సత్తాచాటడంతో మన సైనికుల ధైర్యసాహసాలను మెచ్చుకుంటూ పలుచోట్ల తిరంగా యాత్ర పేరిట ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఆదివారం పలుచోట్ల ఈ యాత్రలు చేపట్టగా మలికిపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు తిరంగా యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



బదిలీల బెంగ!

- ప్రభుత్వ ఉద్యోగుల్లో కొత్త టెన్షన్
- నేతల సిఫార్సుల లేఖల కోసం క్యూకడుతున్న ఉద్యోగులు

మండపేట, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఉద్యోగులబదిలీలకు పచ్చజెండా ఊపింది. దీంతో బదిలీల ప్రక్రియ మొదలుకానుంది. ఉద్యోగులుతాము కోరుకున్న చోటు కోసం నేతల సిఫార్సు లేఖలకోసం క్యూకడుతున్నారు. వచ్చేనెల 2వతేదీ వరకు బదిలీల పరంపర ఉండడంతో ఉద్యోగులంతా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల లేఖలకోసం ప్రయత్నాలు ప్రారంభించారు. తమకు అనుకూలమైన ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రజాప్రతినిధులు ఇప్పటినుంచే ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది. లేఖల కోసం గ్రామ స్థాయి నేతలనుంచి మండల, నియోజకవర్గ స్థాయి నేతల ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులను ఉద్యోగులు ప్రసన్నం చేసుకుంటున్నారు. వచ్చే నెల 2వతేదీ దాటితే కానీ ఏ ఉద్యోగి ఎక్కడ ఉంటారనేది తెలియని పరిస్థితి. ముఖ్యంగా ఐదేళ్లపాటు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ తప్పనిసరని ప్రభుత్వం బదిలీ ఉత్తర్వు ల్లో పేర్కొంది. దీంతో ఐదేళ్లపాటు సర్వీసు ఒకేచోట పూర్తి చేసుకున్న ఉద్యోగుల్లో తమను ఎక్కడకు బదిలీ చేస్తారోనన్న భయం వెంటాడుతోంది.

రాజకీయ పైరవీలు

అటెండర్‌స్థాయినుంచి జిల్లా మండల, గ్రామ స్థాయి అధికారుల వరకు బదిలీలు ఉండనున్నాయి. ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ఠ వేసిన ఉద్యోగులు ఈసారి బదిలీల్లో కదలక తప్పడంలేదు. మండలస్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో వంటి కీలక శాఖల్లో పనిచేసే ఏఈలు తమకు నచ్చిన చోటు కోసం రాజకీయ పైరవీలు ప్రారంభించారు. ఎవరిని ఎక్కడ నియమిస్తే తమకు పనులు జరుగుతాయో అనే అంశంపై కూడా స్థానిక ప్రజాప్రతినిధులు వారి అనుచరులతో చర్చించి ఉద్యోగులకు సిఫార్సు లేఖలను అందిస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా ఉద్యోగుల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి, ఏడాదిలో ఉద్యోగ విరమణ చేసేవారికి ఉద్యోగ బదిలీల్లో మినహాయింపునివ్వడం ఉద్యోగులకు ఊరటనిస్తోంది. ఈసారి కూటమి ప్రభుత్వంలో జరిగే బదిలీల్లో రాజకీయ ప్రాధాన్యం స్పష్టంగా కనిపిస్తోంది



సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

» నాలుగవ రోజు 1.30 లక్షల మంది పుణ్య స్నానాలు

భూపాలపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వర క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పుష్కరాల్లో మొదటి రెండు రోజులు జనం పెద్దగా కనిపించకపోయినా శని, ఆదివారాల్లోనే దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 1.30 లక్షల మందికి పైగా భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేశారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించిపోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

సిరాజ్-ఉర్-రెహ్మాన్ అరెస్టయ్యారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

ఏం జరిగింది?: విజయనగరం జిల్లా కేంద్రంలోని అంబటి సత్రానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి అక్కడే ఉగ్రవాద కార్యకలాపాలపై ఆసక్తి పెంచుకున్నాడు. ఆ తర్వాత విదేశీ ఉగ్రవాద సంస్థ ఐఎస్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సంస్థ సూచనలతో పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను ఆన్‌లైన్‌లో సంపాదించాడు. దీనిపై ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు సమాచారం అందింది. అంతేకాకుండా గతంలో సిరాజ్ సామాజిక మాధ్యమంలో పాకిస్థాన్ అనుకూలంగా పోస్టులు పెట్టినట్టు గుర్తించారు. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌తో రహ్మాన్‌కు ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. సమీర్ కూడా ఉగ్రసానుభూతి పరుడిగా మారినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో సమీర్‌ను హైదారాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయనగరం తీసుకొచ్చారు. ఏపీ, తెలంగాణ పోలీసులతో పాటు, జిల్లా పోలీస్ అధికారులు ఇద్దరినీ పూర్తి స్థాయిలో విచారించారు. ఇద్దరిపైనా ఉగ్రవాద సానుభూతి చర్యలు, పేలుళ్లకు కుట్ర, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జడ్జి ముందు ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. కాగా.. సిరాజ్ తండ్రి, సోదరుడు ఏపీ పోలీస్ శాఖలో పని చేస్తున్నారు.

యూట్యూబ్‌లో చూసి..: సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల(హ్యాండర్లు) నుంచి బాంబుల తయారీకి ఆదేశాలు వచ్చినట్లు ఇరురాష్ట్రాల నిఘావర్గాలు గుర్తించాయి. ఈ క్రమంలో బాంబులు ఎలా తయారు చేయాలనే విషయాన్ని యూట్యూబ్‌లో వెతుకులాడినట్టు అధికారులు గుర్తించారు. అనంతరం, హైదరాబాద్‌లో బాంబులను తయారు చేశారని నిర్ధారించారు. ఈ బాంబులను పరీక్షించేందుకు కొన్ని ప్రదేశాలను వీరు ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అసలు హైదరాబాద్‌లో వీరి టార్గెట్ ఏమిటి? ఎక్కడ పేలుళ్లకు కుట్రలు పన్నారు? ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణాల్లో వీరిని విచారించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

గురితప్పిన ఇస్రో బాణం

(మొదటి పేజీ తరువాయి)

ఉపగ్రహాన్ని తీసుకుని భారీ అంచనాలతో నింగిలోకి ఎగిరిన పీఎస్‌ఎల్వీ-సీ61 సాంకేతిక సమస్య కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ ప్రయాణ గమన దిశ మారింది. సాంకేతిక సమస్యను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ దిశను మార్చి నిర్దేశిత మార్గంలోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ మిషన్‌ను అర్ధంతరంగా ముగించాల్సి వచ్చింది. ప్రామాణిక భద్రత ప్రొటోకాల్‌ను అనుసరించి సాంకేతిక సమస్యను గుర్తించిన తర్వాత రాకెట్‌లోని నాలుగో దశ, పేలోడ్ (ఈవోఎస్-09)లను కూల్చివేశారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. ప్రయోగం పూర్తి కాలేదని.. రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసుకొన్న రాకెట్‌కు మూడో దశలో సాంకేతిక సమస్య వచ్చిందని వెల్లడించారు. దీంతో... సరిహద్దులపై నిఘా కోసం ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు భారత్ చేసిన ప్రయత్నం తాత్కాలికంగా నిలిచిపోయింది.

పీఎస్‌ఎల్వీకి మూడో పరాజయం

అంతకుముందు శనివారం ఉదయం 7.59 గంటలకు ప్రారంభమైన 22 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే ఆదివారం ఉదయం 5.59 నమిషాలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి పయనమైంది. 8 నిమిషాలకు తన రెండు దశలను సునాయసనంగా పూర్తి చేసుకొంది. మూడో దశలోకి ప్రవేశించగానే సాంకేతిక సమస్య తలెత్తింది. ఘన హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలిబ్యూటాడిన్ (హెచ్‌టీపీబీ) మోటారుతో నడిచే మూడో దశ (పీఎస్3) సరిగ్గా పనిచేయలేదు. దీంతో రాకెట్ గతి తప్పింది. పీఎస్3 దశకు సంబంధించిన డేటా, తయారీ రికార్డులను పరిశీలించేందుకు ఇస్రో ఒక వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. పీఎస్‌ఎల్వీ శ్రేణిలో ఇస్రో ఇప్పటివరకూ 63 ప్రయోగాలు చేపట్టగా.. ఇది మూడో వైఫల్యమేనని, 2017 తర్వాత పీఎస్‌ఎల్వీ రాకెట్ విఫలమవడం ఇదే తొలిసారని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు.



ఇస్రో జైత్రయాత్రకు బ్రేక్

ఎనిమిదేళ్లుగా 58 విజయాలతో ఇస్రో విజయ పరంపర కొనసాగిస్తోంది. 2017 నుంచి ఈ ఏడాది జనవరి 29 వరకు... పీఎస్‌ఎల్వీ, జీఎస్‌ఎల్వీ, ఎస్ఎస్‌ఎల్వీ, గగన్‌యాన్-డీ1, ఆర్ఎల్‌వీ-టీడీ ఇలా వరుసగా 58 ప్రయోగాల్లో విజయం సాధించింది. ఈ సక్సెస్‌తో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఇందులో చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్-డీ1 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు దేశ రక్షణ, సైనిక అవసరాలు, సరిహద్దుల్లో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం ఈవోఎస్-09ను పంపేందుకు ఆదివారం ఇస్రో చేపట్టిన పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్ విఫలమవడంతో వరస విజయాలకు బ్రేక్ పడింది.

60 విజయాలు.. 3 వైఫల్యాలు

1969 ఆగస్టు 15న ప్రారంభమైన ఇస్రో.. 1993లో పీఎస్‌ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. పీఎస్‌ఎల్వీ-డీ1 పేరిట 1993 సెప్టెంబరు 20న తొలి ప్రయోగం చేపట్టగా.. నాలుగో దశలో ద్రవ ఇంధనంలో సాంకేతిక లోపం తలెత్తి అది విఫలమైంది. అనంతరం 1994 అక్టోబరు 15న పీఎస్‌ఎల్వీ-డీ2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. అక్కడి నుంచి ఇస్రో వరుసగా 39 విజయాలు సాధించింది. 2017 ఆగస్టు 31న పీఎస్‌ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ వైఫల్యం తర్వాత 8 ఏళ్లలో పీఎస్‌ఎల్వీ ద్వారా చేపట్టిన 21 రాకెట్ ప్రయోగాలు వరుసగా విజయం సాధించాయి. తాజాగా పీఎస్‌ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది.

ఉక్రెయిన్‌పై 273 డ్రోన్లతో దాడి

కీవ్, మే 18: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో 273 డ్రోన్లతో దాడులకు తెగబడింది. డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఒక మహిళ మృతి చెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో భారీ డ్రోన్ దాడి జరగలేదని తెలుస్తోంది. కాల్పుల విరమణ దిశగా మాస్కో, కీవ్ మధ్య మొదటిసారి ఇస్తాంబుల్ వేదికగా జరిగిన ముఖాముఖి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో రక్తపాతానికి ముగింపు పలకడానికి గాను సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్, తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ఫోన్‌లో మాట్లాడనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా, మే 18: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు. ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ ఆస్పత్రి చుట్టూ దాడులు జరగడంతో ఆస్పత్రిని మూసివేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర గాజాలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న ప్రధాన ఆస్పత్రి ఇదే. తాజాగా హౌతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించారు. దీంతో ఆదివారం ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌ల మోత మోగింది.

కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు: భారత్

న్యూఢిల్లీ, మే 18: భారత్, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోఎస్) మధ్య ఆదివారం ఎలాంటి చర్చలూ జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. అలాగే ఈ నెల 11న ఇరు దేశాలు తీసుకున్న కాల్పుల విరమణ నిర్ణయానికి 'ముగింపు తేదీ ఏమీ లేదు' అని వెల్లడించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ నిర్ణయం ఈ నెల 18తో ముగుస్తుందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో భారత సైన్యం దీనిపై స్పష్టతనిచ్చింది. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' ప్రతీకార చర్య కాదని.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు చేసిన న్యాయమని భారత సైన్యం స్పష్టం చేసింది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు ఎలా ప్రణాళిక రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణ ఇచ్చింది, ఈ ప్రణాళికను ఎలా అమలు చేసింది.. అనే విషయాలు తెలియజేస్తూ 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్..' పేరుతో ఆర్మీ ఆదివారం ఓ వీడియోను షేర్ చేసింది.

ఆకాశ్ పనితీరు చూడ్డానికి..కలాం ఉంటే బాగుండేది!

» 'ఆంధ్రజ్యోతి'తో డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త,ఆకాశ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రహ్లాదరామారావు



అల్వాల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ మన దేశంపైకి ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తుత్తునియలు చేసిన ఆకాశ్ క్షిపణుల తయారీ అబ్దుల్ కలాం కలల ప్రాజెక్టు అని.. దానికి ఆయన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని డీఆర్‌డీవో రిటైర్డ్ శాస్త్రవేత్త, కర్ణాటకకు చెందిన డాక్టర్ ప్రహ్లాదరామారావు పేర్కొన్నారు. ఆకాశ్ పనితీరు చూడటానికి ఆయన ఇక్కడ ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో కీలకమైన ప్రాజెక్టులన్నింటికీ కేంద్రస్థానంగా మారిన హైదరాబాద్ డీఆర్‌డీవోలో అభివృద్ధి చేసిన అనేక రక్షణ ఉత్పత్తులు యుద్ధరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం.. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు రామారావుకు ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడ అత్యంత కీలకమైన బాధ్యత అప్పగించారు. అలా తాము అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణులు దాయాది దేశ క్షిపణులను విజయవంతంగా తిప్పికొట్టడం ఆనందం కలిగించిందని.. అది తన జీవితంలోనే అత్యంత సంతృప్తికరమైన రోజని ప్రహ్లాదరామారావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఆకాశ్ క్షిపణిని అభివృద్ధి చేసే క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. కలాం మద్దతుతో ప్రాజెక్టును కొనసాగించామని తెలిపారు.

ఘనంగా నూతన పోప్ ప్రమాణ స్వీకారం



వాటికన్ సిటీ, మార్చి 18: నూతన పోప్ లియో-16 ప్రమాణ స్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ప్రారంభ ప్రార్థనకు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. వారసత్వంగా వస్తున్న గొర్రెపిల్ల ఉన్నితో చేసిన శాలువాను భుజాలపై వేసినప్పుడు, 'మత్స్యకారుని ఉంగరాన్ని' వేలికి తొడిగినప్పుడు ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ఉంగరాన్ని తొడిగిన అనంతరం చేతులను చూసుకొని దండాన్ని ధరించారు. తరువాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ హాజరయ్యారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

గ్యాంగ్‌స్టర్ పాత్రలో కమల్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. శ్రీయ కథానాయికగా, శింబు కీలక పాత్రలో నటించారు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తు



న్నాయి. జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. కమల్ హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. తెలుగులో ఈ సినిమాను ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.

ఆలయ రక్షణ కోసం..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భైరవం'. డా.జయంతి లాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రామంలోని వారాహి ఆలయం చుట్టూ కథ తిరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆలయం భూములపై కన్నేస్తాడు. దాంతో గ్రామంలో శాంతికి భంగం కలుగుతుంది. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు కలిసి ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తాయి. ట్రైలర్‌ని బట్టి చూస్తే కమర్షియల్ వాల్యూస్‌తో ఉన్న కథను దర్శకుడు చాలా ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారనిపిస్తోంది.

కొత్తదనంతో నిండిన చిత్రం



నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ పొట్టా తెరకెక్కిస్తున్న చిత్రం 'కరాలి'. మండలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత సాహూ గారపాటి క్లాప్ కొట్టి స్క్రిప్టును అందజేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ "నేనింతవరకూ ఇటువంటి యాక్షన్ డ్రామా చేయలేదు. కొత్తదనంతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

హారర్ థ్రిల్లర్ అమరావతికి ఆహ్వానం



శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్, థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం' షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కోసం ఇటీవల 20 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. జీవీకె దర్శకత్వంలో కె.ఎస్.శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు శివ కంఠంనేని మాట్లాడుతూ 'ప్రజెంట్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఓ మంచి హారర్, థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా చిత్రం బాగుంటుంది' అని తెలిపారు. సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇదనీ, ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందనీ దర్శకుడు చెప్పారు.

నా కెరీర్‌లోనే ప్రత్యేకం

\- సుమయ రెడ్డి



'డియర్ ఉమ' సినిమాతో తెరంగేట్రం చేశారు తెలుగమ్మాయి సుమయ రెడ్డి. ఈ సినిమాకు ఆమె నిర్మాతగానూ వ్యవహరించడం విశేషం. ఇందులో ఆమె పోషించిన డాక్టర్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'డియర్ ఉమ' ఎంతో ప్రత్యేకమైంది. నటిగా నాకు మంచి బ్రేక్‌తో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు అందించిన ఆదరాభిమానాలు మరువలేనివి. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు సాగుతాను' అని చెప్పారు. త్వరలోనే ఆమె నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ప్రకటించనున్నారు.

జూన్ నుంచి థియేటర్లు బంద్



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని, థియేటర్లు మూసివేయాలని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో తెలంగాణ, ఆంధ్రా సినీ ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చాలా కాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్లు వాదిస్తుంటే, పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిటర్ల సమావేశంలో పర్సంటేజీలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు.

ఈ సినిమాలపై ప్రభావం

జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలనే ఎగ్జిబిటర్ల నిర్ణయంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నెలాఖరు నుంచి వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. మే 30న భైరవం, జూన్ 5న థగ్ లైఫ్, జూన్ 12 హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర, జూలైలో కింగ్‌డమ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.



చీరలు కట్టే..రక్షణ పెట్టే

పంటను పశువులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు ఓ రైతుకు తట్టిన ఆలోచనే ఈ ఫొటో. కాకినాడ జిల్లా తుని మండలం మరువాడలో కూరగాయల పంటకు పాత చీరలను కట్టాడు. ఇది చూసిన పలువురు పాత చీరలను కొత్తగా ఉపయోగించడం బాగుందని కితాబునిస్తున్నారు.

– ఫొటోగ్రాఫర్, కాకినాడ

పాపికొండలకు పోదాం..





పాపికొండలకు గోదావరిలో పర్యాటకులతో వెళ్తున్న బోట్లు

తరలివచ్చిన 600 వందల మంది పర్యాటకులు

దేవీపట్నం/వీఆర్‌పురం, మే 18 (ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలు తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తరలివచ్చారు. ఆదివారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి 600 వందల మంది పర్యాటకులు 13 బోట్లలో పోశమ్మ గండి వద్ద ఉన్న బోట్ పాయింట్ నుంచి బయలుదేరి వెళ్లారు. పూడిపల్లి, దేవీపట్నం, తొయ్యేరు అగ్రహారం, మూలపాడు, మడిపల్లి మంటూరు, నడిపూడి, కచ్చులూరు, తాళ్లూరు కొండ మొదలు గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. ముందుగా మాతృశ్రీ గండి పోశమ్మను దర్శించుకున్నారు. అనంతరం ప్రకృతి అందాలను ఆస్వాదించారు. గోదావరిలో వెళ్తూ ఎంతో ఆనందంగా గడిపారు.

రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి స్థలం కబ్జాపై

ఇంటెలిజెన్స్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం 49వ డివిజన్ గైగోలుపాడులో రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి కొత్తపల్లి వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులకు చెందిన సర్వే నెం.194/4లో 700 గజాల స్థలం కబ్జాపై ఇంటెలిజెన్స్ విభాగం ఆరా తీసింది. రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి స్థలం కబ్జాపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ సమస్యపై సమగ్ర వివరాలు సేకరించి నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆదేశించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు స్థలం కబ్జాకు పాల్పడిన వైసీపీ నాయకులపై ఇంటెలిజెన్స్ అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నారు.

మట్టి తవ్వకాల అడ్డగింత

పిఠాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెంలోని పాపిడిదొడ్డి చెరువులో మట్టి తవ్వకాలకు మరోమారు ప్రయత్నించడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువులో మట్టి తవ్వకాలకు విరవాడకు చెందిన మహిళా రైతు పేరుపై అనుమతులు మంజూరయ్యాయి. వీరు కొద్ది రోజులుగా మట్టి తవ్వకాలకు ప్రయత్నిస్తుండగా ఎఫ్‌కే పాలెం గ్రామస్తులు, రైతులు, ఉపాధి కూలీలు అడ్డుకుంటున్నారు. వీరి ఆందోళనలను మట్టి తవ్వకందారులు పట్టించుకోకుండా మరోసారి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలను ప్రారంభించారు. దీంతో సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషబాబ్జీ ఆధ్వర్యంలో నాయకులు కోనేటి రాజు, కుంచే చిన్నా, ఎఫ్‌కేపాలెం గ్రామస్తులు అడ్డుకున్నారు. మట్టి తవ్వకందారులతో పాటు విరవాడ రైతులు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. తహశీల్దార్ వీవీ గోపాలకృష్ణ, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ జానీబాషా ఇరువర్గాలతో చర్చలు జరిపారు. పాడా పీడీ చైత్రవర్షిణి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు వారితో చర్చలు జరిపారు. తవ్వకాలకు ఒప్పుకునేది లేదని గ్రామస్తులు, రైతులు తేల్చి చెప్పారు.



తవ్వకాలను అడ్డుకుంటున్న దృశ్యం

తప్పిన పెను ప్రమాదం

కోనసీమ జిల్లా నగరం జీసీఎస్ వద్ద జనరేటర్‌లో మంటలు

అదుపుచేసిన ఓఎన్జీసీ సిబ్బంది, ఊపిరి పీల్చుకున్న స్థానికులు



నగరంలోని జీసీఎస్‌లో మంటలు



మంటలను అదుపు చేస్తున్న ఓఎన్జీసీ సిబ్బంది

మామిడికుదురు, మే 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని ఓఎన్జీసీ జీసీఎస్‌లోని జనరేటర్‌లో ఆదివారం సాయంత్రం మంటలు ఏర్పడ్డాయి. అధిక ఉష్ణోగ్రత వల్ల మంటలు ఏర్పడడంతో సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి అదుపు చేశారు. జనరేటర్‌లోని మంటలతో పాటు పక్కనే ఉన్న ఎండుగడ్డి అంటుకోవడంతో స్థానికులు భయాందోళన చెందారు. ఓఎన్జీసీకి చెందిన ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. జీసీఎస్‌కు నిత్యం సుమారు 13 బావుల నుంచి ముడి చమురు, సహజ వాయువు సరఫరా అవుతోంది. జనరేటర్‌లో మంటలు చెలరేగడంతో ఆయా బావుల్లోని కొన్నింటిని నుంచి ఉత్పత్తిని నిలిపేశారు. జనరేటర్‌లో మంటలు ఏర్పడ్డాయా లేదా పైపులైను లీకై మంటలు ఏర్పడ్డాయాఅని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

అయినవిల్లి సిద్ధి వినాయకునికి

రూ.30లక్షల విలువైన బంగారు పాదుకలు



దాతకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఈవో



వినాయకునికి సమర్పించిన పాదుకలు

అయినవిల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామికి రూ.30లక్షల విలువైన బంగారు పాదుకలను ఆదివారం బహూకరించారు. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే మంతెన సుబ్బరాజు వంశవారసులు... వెంకటకృష్ణరాజు- దుర్గావతి దంపతులు, వారి కుమారులు వెంకటసూర్యసుబ్బరాజు-శ్వేత దంపతులు 369 గ్రాములు బంగారు శఠారి (పాదుకలు)ని సమర్పించారు. అర్చకులు వాటికి సంప్రోక్షణ నిర్వహించారు. దాతను శేష వస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం అందజేశారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దాతను అభినందించి స్వామివారి చిత్రపటం బహూకరించారు.

'లోవ'కు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ.4.33 లక్షల ఆదాయం





ఆలయంలో తలుపులమ్మ, వంట చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో వంట వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. రూ.4.33లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

ఇంటిని అన్యాయంగా కూల్చేశారు

పిఠాపురంలో మహిళ ఆవేదన

పిఠాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టా ఉన్నప్పటికి ఆ స్థలంలో తాను కట్టుకున్న ఇంటిని అధికారులు అన్యాయంగా కూల్చివేశారని కాకినాడ జిల్లా పిఠాపురం ఇందిరానగర్‌కు చెందిన మిరియాల సూర్యకుమారి ఆవేదన వ్యక్తం చేసింది. తనకు 2011లో అప్పటి తహశీల్దారు నివేశన స్థల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారని ఆమె ఆదివారం సాయంత్రం విలేకర్లకు తెలిపింది. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తన ఇంటిని అధికారులు కూల్చివేశారని, ఇప్పుడు పిల్లలతో తాను ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేసింది. తమ కుటుంబాన్ని డిప్యూటీ సీఎం పవన్ ఆదుకుని న్యాయం చేయాలని కోరుతోంది.



పిఠాపురంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న మిరియాల సూర్యకుమారి

లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఐదుగురు గాయపడినట్టు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. జంగారెడ్డిగూడెనికి చెందిన మదంపాటి గణేష్‌కుమార్ ఈనెల 15న తన కుమార్తెలిద్దరితో పాట బావమరిది పిల్లలిద్దరిని మోటార్‌సైకిల్ ఎక్కించుకుని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బయలుదేరాడు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై 6వ స్తంభం వద్ద ఎదురుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్ చేస్తుండగా ఎదరుగా వస్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్‌కుమార్‌తో పాటు నలుగురు పిల్లలకు గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గణేష్‌కుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సత్యనారాయణ తెలిపారు.

కారు, మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీ

ఇద్దరికి గాయాలు



గాయపడిన ఓ వ్యక్తి

సామర్లకోట, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారు కోదండరామపురం మలుపు వద్ద ఆదివారం కారు, మోటార్‌సైకిల్ పరస్పరం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో మోటార్‌సైకిల్ నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోట నుంచి పిఠాపురం వెళ్తున్న పిఠాపురానికి చెందిన ఇద్దరు సామర్లకోటలో పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా కోదండరామపురం మలుపు వద్దకు వచ్చేసరికి పిఠాపురం నుంచి సామర్లకోట వైపునకు వస్తున్న కారు అతి వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైస్కూల్‌లో కంప్యూటర్లు, ప్రింటర్లు చోరీ



శంఖవరంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం, పోలీసులు

శంఖవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం హైస్కూల్‌లో కంప్యూటర్లు, ప్రింటర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈమేరకు హెచ్ఎం భాస్కరలక్ష్మీ అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం వరకూ పదోతరగతి విద్యార్థులకు మెమోలు, హాల్‌టికెట్లు అందజేశామని.. ఆదివారం ఉదయం 9 గంటలకు వచ్చి చూసేసరికి ఆఫీసు గది తాళాలు బద్దలుగొట్టి ఉండటం గమనించినట్టు తెలిపారు. ఆఫీసు రూములో 2 కంపూటర్లు, 2 ప్రింటర్లు లేవని, మంచినీటి ప్యూరిఫికేషను కోసం తీసుకొచ్చిన రిపేరు సామాన్లు కూడా చోరీకి గురయ్యాయని పేర్కొన్నారు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు క్లూస్ టీం సభ్యులతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామంలో కిరాణా దుకాణంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న కేతాడ గోపిని అరెస్టు చేసి అతడి నుంచి 6 క్వార్టర్ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

21న జిల్లా విద్యా శాఖ కార్యాలయాల ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తీర్మానం



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జిల్లా విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడించాలని కాకినాడ ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో తీర్మానించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పలు విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం ఐక్య వేదిక పిలుపు మేరకు తలపెట్టిన ముట్టడి కార్యక్రమానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల సభ్యులు 9 మందితో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ బదిలీల్లో పోస్టులను బ్లాక్ చేయకూడదని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులుండాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర మీడియం ఉండాలని, ఉన్నత పాఠశాలల్లో సెక్షన్‌కు 45మంది దాటితే మాత్రమే రెండో సెక్షన్ ఉండాలి వంటి ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని విద్యా శాఖ కార్యాలయాల ముట్టడిని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మానసిక స్థితి సక్రమంగా లేని బాలికపై

పలుమార్లు వృద్ధుడి అత్యాచారం

- గర్భవతిని చేసిన వైనం
- తల్లి ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్

ముమ్మిడివరం, మే 18 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని 15 ఏళ్ల బాలికకు 61 ఏళ్ల వృద్ధుడు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారంచేసి గర్భవతిని చేసిన ఉదంతమిది. దీనికి సంబంధించి ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో ఓ గ్రామానికి చెందిన ముడే బాలయోగి అలియాస్ బాలయ్య (61) భార్య మృతిచెందడంతో ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. బాలయోగి ఒక్కడే తన ఇంట్లో నివసిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మహిళ భర్త మృతిచెందడంతో ఇద్దరు కుమార్తెలతో ఇంట్లో ఉంటుంది. చిన్న కుమార్తెకు మానసిక స్థితి సక్రమంగా లేక పదో తరగతి చదివి ఇంట్లోనే ఉంటుంది. ఆ బాలికపై కన్నేసిన బాలయోగి మాయమాటలు చెప్పి మోటారుసైకిల్‌పై తిప్పుతూ నాలుగైదు నెలలుగా పలు సార్లు అత్యాచారం చేశాడు. ఆ బాలిక ఆరోగ్యంలోను, శారీరకంగా మార్పులు రావడాన్ని గమనించిన తల్లి స్థానిక వైద్యులను సంప్రదించి అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించగా బాలిక నాలుగు నెలల గర్భవతిగా నిర్ధారించారు. దీంతో ఆ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.నిందితుడు బాలయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్యపై భర్త కత్తితో దాడి

అడిగిన వెంటనే సొమ్ములివ్వలేదని ఆగ్రహం

గొల్లప్రోలు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): తాకట్టులో ఉన్న ఫోన్ విడిపించుకునేందుకు తాను అడిగిన వెంటనే డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్యపై భర్త కత్తితో దాడి చేశాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పాత బ్యాంకు వీధికి చెందిన కిలాడి జ్యోతి చింతపండు వలిచే పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. భర్త శ్రీను వ్యవసాయ పనులు చేస్తున్నా మద్యానికి బానిస కావడంతో ఇంటి వద్ద డబ్బులు ఇవ్వట్లేదు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీను తండ్రి తన కున్న 1.50 ఎకరాల భూమిని మనుమడు కిలాడి శివరాం పేరుపై రాశాడు. అప్పటి నుంచీ కక్ష పెంచుకుని శ్రీను భార్య, పిల్లలను వేధిస్తున్నాడు. తాను సెల్‌ఫోన్ తాకట్టు పెట్టానని, విడిపించేందుకు రూ.2వేలు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో భార్య జ్యోతిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మరణించిన వ్యక్తి

తుని రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నరసింగపల్లి- బయ్యవరం రైల్వేస్టేషన్ మధ్యలో తుని వైపు వెళ్లే రైలు నుంచి ప్రయాణం చేస్తూ సుమారు 30 ఏళ్ల వ్యక్తి జారి పడి మృతిచెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మరణించిన వ్యక్తి వివరాలు కానరాలేదని, బంధువులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన ఆదియ్య

ఉండ్రాజవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం చివటం గ్రామపరిధిలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన మట్టపర్తి ఆదియ్య (40) తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు మోటారుసైకిల్‌పై వస్తుండగా స్థానిక కమ్మకల్యాణమండపం ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆదియ్య తలకు తీవ్రమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ జి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..



ప్రణీత్ (ఫైల్)

యానాం, మే 18 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ బాలుడు చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేసవి సెలవుల నేపథ్యంలో యానాం కనకాలపేట గ్రామంలో తన అమ్మమ్మ పెన్నాడ మంగాదేవి ఇంటికి కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాధగిరికి చెందిన ప్రణీత్ (9) వచ్చాడు. ఈనెల 14న బాత్‌రూంలో స్నానం చేస్తుండగా జారిపోవడంతో మలద్వారం వద్ద ఇనుపరాడ్డు గుచ్చుకుని పెద్దగాయం కావడంతో యానాం ప్రభుతాసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్స చేసిన వైద్యులు ఇంటింకి పంపించారు. 16న గాయం ప్రదేశంలో ఇన్‌ఫెక్షన్ కాడంతో ప్రణీత్‌ను తిరిగి ఆసుపత్రికి తీసుకెళ్లగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. కాకినాడలో వైద్యులు శనివారం ఆపరేషన్ చేసి ఐసీయూకు తరలించారు. ఆదివారం తెల్లవారుజామున బాలుడు మృతిచెందాడు. మృతదేహానికి బంధువులకు అప్పగించారు. యానాం పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రైవర్‌కు ఆర్థిక సహాయం

యానాం, మే18(ఆంధ్రజ్యోతి): ఇటీవల డ్రైవర్ ఉమర్ మృతిచెందడంతో ఆదివారం బాధిత కుటుంబాన్ని యానాం టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరామర్శించి రూ.26,500 అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు సందాల ఏడుకొండలు, ఎండీ సిలేమాన్, పంపన మదుబాబు, కొండి సురేష్, ఇళ్ళ వాసులు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.4.22లక్షలు

ఆత్రేయపురం, మే 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,22,470 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- మలికిపురం, ముమ్మిడివరంలలో తిరంగా ర్యాలీలు

మలికిపురం, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌తో పాటు ప్రపంచ దేశాలకు ఒక సంకేతం పంపారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆదివారం మలికిపురంలో కూటమి ఆధ్వర్యంలో తిరంగ యాత్ర ర్యాలీ నిర్వహించారు. మలికిపురం వేంకటేశ్వరస్వామి గుడి వద్ద నుంచి మలికిపురం సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ పహల్గాం దాడి క్షమించరానిదన్నారు. పహల్గాంలో 26మంది మృతిచెందితే వారి ఆత్మలకు శాంతిగా ఆపరేషన్ సిందూర్ తగిన గుణపాఠం చెప్పిందన్నారు. భవిష్యత్‌లో ఉగ్రవాదులు ఎటువంటి సంఘటనలకైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈసందర్భంగా వీర జవాన్లకు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చిటికెన రామ్మోహనరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాసనగేష్, మండల టీడీపీ అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, గుబ్బల ఫణికుమార్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీపీ కేతా శ్రీను, బోళ్ల వెంకటరమణ, దిరిశాల బాలాజీ, మంగెన భూదేవి, గుండుబోగుల పెదకాపు, అడబాల సాయిబాబు, చెల్లింగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ముమ్మిడివరం గాంధీబొమ్మ సెంటర్ వద్ద త్రివిధ దళాలకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఘనంగా తిరంగా ర్యాలీ

ముమ్మిడివరం, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో త్రివిధ దళాలకు సంఘీభావం తెలుపుతూ ముమ్మిడివరంలో ఆదివారం తిరంగ ర్యాలీని నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వరకు సాగింది. ప్రతీ ఒక్కరూ జాతీయ జెండాను చేతబట్టి తిరంగ యాత్రలో పాల్గొని భారత్‌మాతాకీ జై.. వందేమాతరం.. జవాన్ మురళీనాయక్ జోహార్.. అంటూ నినాదాలు చేశారు. ఆపరేషన్ సిందూర్ అఖండ విజయానికి మన సైతం మన సాయుధ దళాలకు సమష్టిగా కృతజ్ఞతాభినందనలు తెలియచేస్తూ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దాట్ల పృథ్విరాజ్, చెల్లి అశోక్, కమిషనర్ పి.రవివర్మ, ములపర్తి బాలకృష్ణ, నాగిడి నాగేశ్వరరావు, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దాట్ల బాబు, మట్ల సత్తిబాబు, తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, కడలి నాగు, కట్టా సత్తిబాబు, మెండి కమల, మందాల గంగసూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, కోలా బాబ్జి, నడింపల్లి సుబ్బరాజు, చిక్కాల అంజిబాబు, సాగి సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, దూడల స్వామినాయుడు, మద్దింశెట్టి పురుషోత్తం, ముత్యాల జయలక్ష్మి, మాదాల బుజ్జి, విళ్ల వీరాస్వామినాయుడు, చెల్లి నాగరాజు, వాసంశెట్టి అమ్మాజీ, బద్రి రమ, గిడ్డి రత్నశ్రీ, మెండి కమల, కర్రా దుర్గాప్రసాద్, దంగేటి శ్రీనివాస్, కురసాల శివబాబు, కుంచనపల్లి నారాయణ, నిమ్మకాయల విస్సు, పళ్ల రాజబాబు, మాదాల శ్రీధర్, చింతలపూడి కొండబాబు, యేడిద శివ, మాదాల పరంకుశం, ఏఈ వీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ఎన్ రాజు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు, సచివాలయ, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కోసం పనిచేసే వారికే పట్టం కడతాం

- నియోజకవర్గ స్థాయి మహానాడులో ఎమ్మెల్యే ఆనందరావు
- భారీగా హాజరైన టీడీపీ నేతలు, కార్యకర్తలు
- పలు తీర్మానాలు ఆమోదించిన సమావేశం

అమలాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం గత కొన్ని సంవత్సరాలుగా ఎంతో కష్టించి పనిచేసిన పార్టీ నేతలను, కార్యకర్తలను గుర్తించి తగు రీతిలో వారికి అవకాశాలు కల్పిస్తామని టీడీపీకి చెందిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను సంస్థాగతంగాను, వివిధ నామినేటెడ్ పదవుల్లోను నియమించడానికి సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు. అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల టీడీపీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయి మహానాడును ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనందరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అమలాపురం పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే పంటకాల్వపై ఈదరపల్లి-నడిపూడి వద్ద రెండు వంతెనలు నిర్మిస్తున్నామని, రానున్న రోజుల్లో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని మరికొన్ని చోట్ల వారధులు నిర్మించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అమలాపురం పట్టణంలో అభివృద్ధికి నోచుకోలేదని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత పట్టణాన్ని అన్ని రంగాల్లోను అభివృద్ధి చేస్తున్నానన్నారు. నియోజకవర్గ స్థాయిలో టీడీపీ, వివిధ అనుబంధ సంస్థలకు చెందిన ప్రతినిధులు చేస్తున్న కృషిని అటు పార్టీ, ఇటు తాను గుర్తించడం జరుగుతుందని, సమయం వచ్చినప్పుడు అందరికీ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈనెల22న అమలాపురంలో జిల్లా స్థాయి మినీ మహానాడు నిర్వహించడానికి పార్టీ నిర్ణయించిందని, ఆ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మాట్లాడుతూ అంకిత భావంతో పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందనడానికి తానే ఒక ఉదాహరణగా పేర్కొంటూ ప్రతీ ఒక్కరూ చంద్రబాబు నాయకత్వంలో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఆనందరావును అభినందించడంతో పాటు రానున్న రోజుల్లో పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు. డీసీఎంఎస్ అధ్యక్షుడు పెచ్చెట్టి చంద్రమౌళి మాట్లాడుతూ టీడీపీని వీడకుండా పనిచేసేవారికి పార్టీ పట్టం కడుతుందనడానికి తనకు లభించిన పదవే ఉదాహరణ అని, ప్రతీ ఒక్కరూ చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గస్థాయిలో హాజరైన పార్టీ మండల అధ్యక్షులు, వాటి అనుబంధ సంస్థల ప్రతినిధులు టీడీపీఅభివృద్ధి కోసం సూచనలు, సలహాలు ఇస్తూ ప్రసంగాలు చేశారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, మండల అధ్యక్షుడు మల్లుల పోలయ్య, అల్లవరం మండలాధ్యక్షుడు దంతులూరి సత్తిబాబురాజు, టీడీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, టీడీపీ నేతలు నిమ్మకాయల సూర్యనారాయణ, నల్లా స్వామి, పొలమూరి ధర్మపాల్, బొర్రా ఈశ్వరరావు, చింతా శంకరమూర్తి, అరిగెల నానాజీ, మాకిరెడ్డి పౌర్ణిమ, నియోజకవర్గంలోని టీడీపీకి చెందిన వివిధ అనుబంధ సంస్థల పార్టీ అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు సభలో పాల్గొన్నారు.


నియోజకవర్గ స్థాయి మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

పలు తీర్మానాలు ఆమోదం..

అమలాపురం నియోజకవర్గంలో ప్రతీ ఇంటికీ తాగునీరు అందేలా కుళాయిలు ఏర్పాటు చేయాలి. జిల్లా కేంద్రమైన అమలాపురంలో రోడ్లను విస్తరించి పునర్నిర్మించాలి. సీఎం ఇచ్చినహామీ మేరకు అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ కళాశాలను మంజూరు చేయాలని నియోజకవర్గస్థాయి సమావేశం తీర్మానించింది. పీ4 విధానంలో వైద్య కళాశాల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. కోటిపల్లి-ముక్తేశ్వరం వంతెన నిర్మించాలి. జిల్లాను టూరిజం హబ్‌గా ప్రకటించి ప్రాజెక్టులు నెలకొల్పాలి. ఏదైనా యూనివర్శిటీని అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరుతూ సమావేశం తీర్మానించినట్టు ఎమ్మెల్యే ఆనందరావు ప్రకటించారు.

ఘనంగా ప్రాచీన వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు


ఆదుర్రు బౌద్ధ స్థూపం వద్ద ప్రార్థనలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు

మామిడికుదురు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆదుర్రు బౌద్ధ స్థూపం వద్ద బుద్ధ పౌర్ణమి సందర్భంగా ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదుర్రు బుద్ధవిహార్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం బౌద్ధ స్థూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బౌద్ధ భిక్షువులు సంఘపాల, విజయానంద, బంతే అబయబోధి, సత్యబోధిలు పాల్గొని దమ్మ సందేశాన్ని ఇచ్చారు. బౌద్ధ స్థూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పూజలు చేసి స్థూపం చుట్టూ తిరుగుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతీ ఒక్కరూ బుద్ధుడు సూచించిన మార్గంలో పయనించాలని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బౌద్ధ స్థూపం వద్ద అనేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధవిహార్ ట్రస్టు ఫౌండర్ మెంబర్ ఎస్ఎస్ఆర్ భూపతి, అధ్యక్షుడు చింతా శ్రీరామమూర్తి, బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాలువ

చెత్తా చెదారంతో కనిపిస్తున్న వైనం


రాజోలులో అధ్వానంగా ఉన్న గన్నవరం ప్రధాన పంటకాల్వ

రాజోలు, మే 18(ఆంధ్రజ్యోతి): రాజోలులో జాతీయ రహదారి 216 పక్కనే ఉన్న గన్నవరం ప్రధాన పంటకాల్వ మొక్కలు, చెత్తా చెదారంతో అధ్వానంగా దర్శనమిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదు సంవత్సరాలుగా పంటకాల్వలు ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ప్రధాన పంటకాల్వలు, పంటబోదెలు దారుణంగా ఉన్నాయి. ప్రస్తుతం కాల్వలు కట్టేసి 20రోజులు అయినప్పటికీ పంటకాల్వల్లో ఆధునికీకరణ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

రాజోలు ఇరిగేషన్ డీఈఈ నాగేంద్రకుమార్

గన్నవరం పంటకాల్వ ఆధునికీకరణ పనులు రాజోలు నుంచి సఖినేటిపల్లి వరకు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.

మత్స్యకార విద్యార్థులకు ప్రోత్సాహకాలు

యానాం, మే 18(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి మత్స్యశాఖ ద్వారా యానాం నియోజకవర్గం పరిధిలో నివసిస్తున్న మత్స్యకార విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు తెలిపారు. పదోతరగతిలో 70శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి రూ.7,500, 60 నుంచి 70శాతం వచ్చిన వారికి రూ.5వేలు, 12వ తరగతిలో 70శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి రూ.15వేలు, 60నుంచి 70శాతంసాధించిన వారికి రూ.7వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. జూన్ 27వ తేదీలో దరఖాస్తును మత్స్యశాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

ఘనంగా అన్నసమారాధన

మామిడికుదురు, మే 18(ఆంధ్రజ్యోతి): గెద్దాడ గ్రామదేవత మాణిక్యాలమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆదివారం అన్నసమారాధన ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. 3వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్టు కమటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారంతో జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డైరెక్టర్ పూజలు

ఆత్రేయపురం, మే 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ని ఆదివారం సమగ్ర శిక్షాభియాన్(కేజీబీవీ) కార్యదర్శి, డైరెక్టర్ డి.శివానందరెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చక బృందం ఘనస్వాగతం పలికింది.

బండారులంకలో ముగిసిన స్వామివార్ల ఉత్సవాలు


అమలాపురం: బండారులంకలో వేంకటేశ్వరస్వామికి చీర, సారె సమర్పించేందుకు తీసుకువెళుతున్న మహిళా భక్తులు


ఉప్పలగుప్తం: మల్లమ్మకు ఊరేగింపుగా సారె తీసుకువస్తున్న మాజీ మునసబు కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం బండారులంకలోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి 38వ వార్షిక మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముత్తయిదువులు అందరూ కలిసి స్వామివార్లకు చీర, సారె సంప్రదాయబద్ధంగా సమర్పించారు. మంగళవాయిద్యాల నడుమ గోవింద నామస్మరణతో చీర, సారె, పసుపు, కుంకుమ, జాకెట్లు, గాజులు, చలిమిడి, మిఠాయిలు ఊరేగింపుగా స్వామివారి సన్నిధికి తీసుకువచ్చి సమర్పించారు. అర్చకులు బీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో స్వామివార్లకు మహిళలు అందించారు. ఈసందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో బిళ్ల లక్ష్మీకుమారి, అంకం సత్యలక్ష్మి, నల్లా జయ, బిళ్ల భద్రకాళీ, పిచ్చిక జ్యోతి, నల్లా వెంకటసత్యనారాయణమ్మ, ఉప్పుగంటి కుమారిలక్ష్మి దొమ్మేటి దుర్గ, బాసిన భారతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు సారె సమర్పణ

ఉప్పలగుప్తం, మే 18(ఆంధ్రజ్యోతి): నంగవరం గ్రామదేవత మల్లమ్మతల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆచారం ప్రకారం మల్లమ్మకు 108 కిలోల రకరకాల తీపి మిఠాయిలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు సారెగా సమర్పించారు. నంగవరం మాజీ మునసబు గుర్లింక సూర్యనారాయణమూర్తి, సోమాలమ్మ దంపతుల కుటుంబ సభ్యులు ఈ సారెను సమర్పించారు. భాజాభజంత్రీలు, కొమ్ము బూరలు, మంగళ వాయిద్యాల నడుమ భారీ ఊరేగింపుతో సారెను మల్లమ్మ దేవాలయానికి తీసుకెళ్లారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు తాతపూడి సాయిరామ్ పూజలు నిర్వహించిన అనంతరం సారెను నివేదించారు. గుర్లింక మల్లికార్జునసాయిరామ్, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఈకార్యక్రమంలో మాజీ మునసబు కుటుంబీకులు నారాయణస్వామి, మల్లికార్జునసాయిరాం, నరసింహారావు, సూర్యనారాయణమూర్తి, సాయిసురేష్, జిన్నూరి భ్రమరాంబ, నిమ్మకాయలఅమ్మాజీ, గుర్లింక వెంకన్నబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పీఆర్టీయూ సమావేశం

మలికిపురం, మే 18(ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న అసంబద్ధత విధానాలను ఖండిస్తూ ఆదివారం పీఆర్టీయూ సమావేశం జరిగింది. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన 117 జీవో వల్ల పాఠశాలల్లో అనేక అసమానతలు ఏర్పడ్డాయని దీనిని నివారిస్తూ ప్రస్తుత పాలకులు జీవో నంబరు 19, 20, 21 విడుదల చేయడం జరిగింది. ఈజీవోల వల్ల ప్రస్తుత పాఠశాలల్లో తొమ్మిది రకాల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని, వీటిలో కూడా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి వేర్వేరుగా ఉంచడం జరుగుతుందన్నారు. ఇది పూర్తిగా అసంబద్ధమైనదని, సెకండరీ టీచర్లకు రావాల్సిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లను మిగులు స్కూలు అసిస్టెంట్లకు కేటాయించడం విరుద్ధమన్నారు. యూపీ పాఠశాలకు స్కూలు అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలన్నారు. ప్రతీ మోడల్ ప్రైమరీ పాఠశాలకు సంఖ్యతో సంబంధం లేకుండా ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రతీ హైస్కూలులో 1:53 నిష్పత్తి కాకుండా 1:45 నిష్పత్తితో మిగులు స్కూలు అసిస్టెంట్ హైస్కూలు, యూపీ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని కోరారు. ప్రతీ హైస్కూలు ఇంగ్లీషు మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియం తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత బదిలీల్లో ఏవిధమైన పోస్టులు బ్లాక్ చేయరాదన్నారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, అప్పారి రామకృష్ణ, కూర్మ గణేష్, ఏపుగంటి వెంకటపద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవాలు ప్రారంభం


అయినవిల్లిలంకలో హోమ పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

అయినవిల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలంక గ్రామంలో 1925వ సంవత్సరంలో ప్రతిష్ఠితమైన శ్రీసీతారామచంద్రస్వామి వారి శతాబ్ది ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీమహాసుదర్శన, అష్టోత్తర శతకలశాభిషేక, శ్రీలక్ష్మీనారాయణ, శ్రీరామనామయజ్ఞంలను సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమాలు, వల్మీక మృత్తికా సంగ్రహణం, యాగశాల ప్రవేశం, యాగమందిర పూజ, నవకుంభారాధన, అంకురార్పణ, వాస్తుపూజ, షట్కుండ ప్రణయనం, అగ్నిప్రతిష్ఠాపనలు, వాస్తు శుద్ధి, యాగశాల ప్రధాన హోమాలు, వర్షవర్ధన దైవత్య హోమాలు జరిపారు. దేవదాయ శాఖ కమిషనరు కె.రామచంద్రమోహన్, చిట్టూరి వీర వెంకట సత్యనారాయణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల అందజేత

అమలాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): తూర్పులంకలో ఇటీవల పిడుగుపాటుకు ఇల్లు దగ్ధమైంది. మంద వీరవెంకటసత్యనారాయణ కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ చింతా అనురాధ ఆదివారం పరామర్శించారు. స్వర్గీయ చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ తరపున 50కిలోల బియ్యం, వంటసామగ్రి, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుస్తులను ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యిళ్ల శేషారావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ గంగ, సర్పంచ్ బర్రే సీతారత్నం, రాపాక విజయలక్ష్మి, కడలి గంగాచలం తదితరులు పాల్గొన్నారు.

బాలభానుకు డాక్టరేట్

అమలాపురం రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం భట్నవిల్లికి చెందిన ఆకెళ్ల బాలభానుకు ఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. మహిళా శతావధానిగా 215 అష్టావధానాలు, 3 శతావధానాలు, ఒక ద్వి శతావధానం చేసిన ఆమెకు ఈ పురస్కారం లభించింది. అవధాన రంగంలో, సాహిత్య రంగంలో ఆమె చేసిన కృషిని గుర్తించి ఢిల్లీలోని కళమంచి ఆడిటోరియంలో వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దోమన చిన్నారావు ఆధ్వర్యంలో బాలభానుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పలువురు అతిథులు పాల్గొని ఆమె అవధాన రంగంలో చేస్తున్న కృషిని ప్రశంసించారు.



ఘనంగా వనువులమ్మ అమ్మవారి తీర్థం

అంబాజీపేట, మే 26: చిరతపూడి గ్రామదేవత శ్రీవనువులమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా శనివారం రాత్రి జరిగిన జాతరలో గరగనృత్యాలు, కోయిడ్యాన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

నేడు అంబాజీపేటలో టీడీపీ మినీ మహానాడు

అంబాజీపేట, మే 18(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు కోరారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. మహానాడులో నియోజకవర్గంలోని సమస్యలు, పార్టీ అభివృద్ధి తదితర అంశాలపై చరిస్తామన్నారు. మినీ మహానాడుకు ఎంపీ గంటి హరీష్‌మాధుర్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నియోజకవర్గ పరిశీలకులు షేక్ సుభాన్ తదదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, సంసాని పెద్దిరాజు, చిన్నం బాలవిజయరావు, దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, మద్దాల సుబ్బారావు, అరిగెల బలరామమూర్తి పాల్గొన్నారు.

నియోజకవర్గ మహానాడును జయప్రదం చేయండి

మలికిపురం, మే 18(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఈనెల20న మధ్యాహ్నం నియోజకవర్గ స్థాయి మహానాడు లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్టు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాటాడారు. రాష్ట్రంలో ప్రజారంజకమైన పరిపాలన కొనసాగుతుందన్నారు. ఈనెల27,28,29తేదీల్లో కడప జిల్లాలో నిర్వహించే మహానాడుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. లక్కవరంలో జరుగు నియోజకవర్గ మహానాడును జయప్రదం చేయాలని కోరారు. పార్టీ మలికిపురం మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, పార్టీ రాజోలు మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, స్వామి, చెల్లింగి సత్యనారాయణ, అడబాల సాయిబాబు, గోళ్ల వెంకటరమణ, గెడ్డం సింహ, రాపాక నవరత్నం, తాడి సత్యనారాయణ, దోనిపాటి రాజు, పిండి సత్యనారాయణ, కడలి వెంకటరత్నం, పుల్లయ్య, శ్యామ్‌బాబు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

24న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కాట్రేనికోన, మే 18(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో ఈనెల24న సాపే అప్పలస్వామి సభాస్థలి వద్ద అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని మాజీ జడ్పీటీసీ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, బడుగు జేమ్స్‌పాల్ తెలిపారు. అంబేడ్కర్ మనవడు డా.యశ్వంత్ భీమ్‌రావ్‌అంబేడ్కర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని అన్నారు. అనంతరం భారీ బహిరంగ నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమానికి అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అంబేడ్కర్ వాదులు, దళిత నాయకులు హాజరుకావాలని కోరారు. కేవీవీ సత్యనారాయణ, గెడ్డం చంద్రశేఖర్, వడ్డి శ్యామ్, గెద్ద శ్రీను, కసిరెడ్డి రాజా, మోకా సత్తిబాబు, పులుగు బాబి, కాశి ఏసు, బూసి మధు, జనిపల్లి సత్యనారాయణ, కొడికలపూడి సత్యనారాయణ, అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు



అంతర్వేది, మే 18(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేసవి సెలవులు కావడంతో పుణ్యక్షేత్రంలో ఉన్న ఆలయాలను సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సందర్శించారు. సాయంత్రం వేళ సాగరసంగమం, బీచ్, లైట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో భక్తులు, పర్యాటకులు సందడి చేశారు.

గోపవరం టీడీపీ అధ్యక్షుడిగా పెమ్మిరెడ్డి

ఉప్పలగుప్తం, మే 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు ఆదివారం గోపవరంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పెమ్మిరెడ్డి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోపవరం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటరమణ స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా కటికదల సుదర్శనరావు, ప్రధాన కార్యదర్శిగా అయితాబత్తుల ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

బాధిత చిన్నారులకు పోషకాహార కిట్లు పంపిణీ

అమలాపురంటౌన్, మే18(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహార కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వంటెద్దు వెంకన్నాయుడు, కె.రిత్విక్, జల్లి సుజాతల సౌజన్యంతో బాధిత చిన్నారులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్‌కు చెందిన సప్పా నాగేశ్వరరావు, పచ్చిగోళ్ల సుధ, కల్వకొలను ఉమ, శ్రీనివాస్, తిక్కా బాబి, అత్తిలి గణేష్, గొల్లపల్లి బాబి, యర్రంశెట్టి ప్రసాద్, అడపా తేజ, పరశురాముడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సునీల్ మరణంపై సమగ్ర విచారణ జరపాలి'

మలికిపురం, మే 18(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురం మీదుగా గుడిమెల్లంక ఓఎన్జీసీ సైట్‌కు వెళ్లే రోడ్డులో గత నెల 12న మోరిపోడుకు చెందిన గంటా సునీల్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరపాలని రాజోలు నియోజకవర్గ పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ప్రసాదరావు, మందా సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘటనా స్థలాన్ని గంటా సునీల్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక దళితేతర కులానికి చెందిన అమ్మాయి విషయంలో అనేకసార్లు కొట్టి హింసించారని, హైదరాబాద్‌లో పనిచేసుకుంటున్న సునీల్‌ను పథకం ప్రకారం రప్పించి అంతమొందించారని అనుమానం వ్యక్తం చేశారు. ఈమృతిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత బహుజన మహిళాశక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, బూసి జాన్‌మోషే, ముత్యాల శ్రీనివాసరావు, చవ్వాకుల వెంకట్, ఆకుమర్తి నాగభూషణం, పమ్మి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు: ఎస్ఐ

ఐ.పోలవరం, మే 18(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐ.పోలవరం ఎస్ఐ రవీంద్రబాబు హెచ్చరించారు. ఆదివారం ఎదురులంక వంతెన వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 12మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల 216 జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగి యువత ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు.

మండపేట

ఘనంగా వనువులమ్మ అమ్మవారి తీర్థం

అంబాజీపేట, మే 18: చిరతపూడి గ్రామ దేవత శ్రీవనువులమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా శనివారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు రైతులకు పవర్ టిల్లర్ల పంపిణీ

రాయవరం, మే 18(ఆంధ్రజ్యోతి): వెంటూరు గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేస్తారని మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ తెలిపారు. ఆదివారం రాయవరంలో ఏవో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు స్థానిక సచివాలయం వద్ద ఎమ్మెల్యే వాటిని పంపిణీ చేస్తారన్నారు.



అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.22 లక్షలు

ఆత్రేయపురం, మే 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,22,470 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఉండి మండలం మహాదేవపట్నానికి చెందిన పి.సూర్యనిఖిల్, హేమలత, లక్ష్మీపావని దంపతులు రూ.2,00,116 విరాళం ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు.

వెంకన్న ఆలయంలో సమగ్ర శిక్షాభియాన్ డైరెక్టర్ పూజలు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సమగ్ర శిక్షాభియాన్ (కేజీబీవీ) కార్యదర్శి, డైరెక్టర్ డి.శివానందరెడ్డి సతీ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆ తర్వాత స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, ఎంఈవో బి.వరప్రసాదరావు, ఉపాధ్యాయులు సరిదే ప్రసాద్, చిప్పాడ సత్యనారాయణ, వై.జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర సమగ్ర శిక్షాభియాన్ డైరెక్టర్‌కు స్వామివారి ప్రసాదం అందిస్తున్న దృశ్యం



మండపేటలో ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మండపేటలో ఎముకల సాంద్రత పరీక్షలు

మండపేట, మే 18(ఆంధ్రజ్యోతి): మండపేటలో టోరెంట్ కంపెనీ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ పర్యవేక్షణలో ఆదివారం ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు జరిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ బిక్కిన తాతబ్బాయి చౌదరి, ఫిజియో థెరపీ వైద్యుడు డాక్టర్ ఎండీ హైదర్ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 150 మందికి ఎముకల సాంద్రత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టెక్నీషియన్ రమేష్, జావిద్, క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బాస్, ఉపాధ్యక్షుడు రెడ్డి రాజు, సీహెచ్ భాస్కర రాజు, గంపల సత్యప్రసాద్, వెంకట్రావు, తాతపూడి సుధీర్, పార్కు సిబ్బంది కన్న, వాసు తదితరులు పాల్గొన్నారు.



చెల్లూరులో పంటబోదె వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పంటబోదెలోకి వ్యర్థాలతో నష్టపోతున్నాం

• చెల్లూరు రైతుల నిరసన • సమస్య పరిష్కరించాలని నేడు ఫిర్యాదు

రాయవరం, మే 18(ఆంధ్రజ్యోతి): పంటబోదె మురుగు కాలువగా మారడంతో పంటలు పండక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆదివారం చెల్లూరు గ్రామాల రైతులు నిరసన వ్యక్తం చేశారు. మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల నుంచి వచ్చే వాడకం నీరు పంచాయతీ డ్రైనేజీల ద్వారా పాత సినిమా హాల్ వెనుక నుంచి పోలేరమ్మ గుడి వెనక ఉన్న పంటబోదెలో మళ్లిస్తున్నారన్నారు. దీంతో మురుగునీరు పంటబోదెలో కలవడం వల్ల సుమారు 100 ఎకరాల్లో పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు వల్ల పంటలు ఎండిపోవడంతో పాటు దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అనేకసార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆరోపించారు. మురుగునీరుతో పాటు చెత్తా, అనేక వ్యర్థాల వల్ల పంటబోదెలోకి నీరు రావడం లేదన్నారు. స్థానిక కాలువ బోదెగట్టు వద్ద రైతులు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో బొల్లంరెడ్డి పట్టాభి రామన్న, పుట్టా రామకృష్ణ, చుండ్రు రమేష్, దేవిన ప్రసాద్, పసల పనసయ్య, గుణ్ణం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కూటమినేతలు

సైనికుల పరాక్రమానికి ప్రతీకగా తిరంగా ర్యాలీ

రావులపాలెం, మే 18(ఆంధ్రజ్యోతి): భారత సైన్యం సిందూర్ విజయానికి నిదర్శనంగా తిరంగా ర్యాలీ చేపట్టినట్టు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఎమ్మెల్యే సత్యానందరావు ఆధ్వర్యంలో రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి భారత సైన్యం కనబరిచిన పరాక్రమానికి ప్రతీకగా తిరంగా ర్యాలీ చేపట్టారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, టీడీపీ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, బీజేపీ నాయకులు అయినవిల్లి సత్తిబాబుగౌడ్‌తో పాటు కూటమి నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి కళా వెంకట్రావు సెంటర్ వరకూ జరిగిన ర్యాలీలో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భారత సైన్యానికి జైజైలు కొడుతూ నిర్వహించిన ఈ ర్యాలీలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ప్రజా ప్రతినిధులు, మాజీ సైనికులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



వేములపల్లిలో తొలగించిన పాకలు

పాకలు, దుకాణాల తొలగింపుపై పేదల అసంతృప్తి

మండపేట, మే, 18(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లి జగనన్న కాలనీ చెంతనే 14 ఏళ్ల నుంచి రోడ్డుపక్కన జీవనం సాగించే వారి పాకలు, గడ్డిమేట్లను తొలగించటంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామానికి చెందిన అధికార పార్టీనేత ఒకరు ఇటీవల అక్కడున్న స్థలాన్ని కొనుగోలు చేశారు. కాలనీని చేర్చి వున్న భూమి మెయిన్ రోడ్డుపక్కనే ఉండటంతో సదరు నేత ప్రభుత్వ పోరంబోకు భూమిని సైతం ఆక్రమించుకునేందుకు సామాన్యులపై తన అధికార బలాన్ని ఉపయోగించి వారి పాకలు, చిరు వ్యాపారుల దుకాణాలను తొలగిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ద్వారపూడిలో అధికార పార్టీ నేతల ఆగడాలతో ప్రజలు, స్థానిక అధికారులు బెంబేలెత్తుతున్నారు. ద్వారపూడిలో పదవులు లేకున్నా కొంతమంది అధికార పార్టీకి చెందిన స్థానిక నేతల తీరు పార్టీకి చెడ్డపేరును తీసుకు వస్తున్నదని స్థానికులంటున్నారు. ద్వారపూడిలో పని చేయాలంటే స్థానిక నేతల తీరుతో ఉద్యోగులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సత్యానందరావు

అంబేడ్కర్ రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శం

కొత్తపేట, మే 18(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం బాబానగర్ వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యంతో కలిసి వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, పల్లికొండ సుధీర్‌కుమార్, నల్లా వెంకటరమణ, కాశీ ధనరాజు, శిల్పి స్వామి తదితరులు పాల్గొన్నారు.



గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వేములపల్లిలోని జగనన్న కాలనీ

పిచ్చిమొక్కల మధ్య జగనన్న కాలనీలు

మండపేట, మే 18(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరిట ఊళ్లకు ఊళ్లను నిర్మిస్తామని ప్రకటించిన అప్పటి ప్రభుత్వం ఆ కాలనీల్లో కనీస వసతులు కల్పించకపోగా, ఇళ్లను పూర్తి చేయలేదు. మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లిలో జగనన్న కాలనీలో ఇళ్లు ఇలా అసంపూర్తిగానే మిగిలిపోయాయి.



అయినవిల్లిలంకలో పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

వైభవంగా సీతారామచంద్రస్వామి ఆవిర్భావ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

అయినవిల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలంక గ్రామంలో 1925వ సంవత్సరంలో ప్రతిష్ఠితమైన శ్రీసీతారామచంద్రస్వామి వారి శతాబ్ది ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీమహాసుదర్శన, అష్టోత్తర శతకలశాభిషేక, శ్రీలక్ష్మీనారాయణ, శ్రీరామనామయజ్ఞంలను సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్‌వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమాలు, వల్మీక మృత్తికా సంగ్రహణం, యాగశాల ప్రవేశం, యాగమందిర పూజ, నవకుంభారాధన, అంకురార్పణ, వాస్తుపూజ, షట్కుండ ప్రణయనం, అగ్నిప్రతిష్ఠాపనలు, వాస్తు శుద్ధి, యాగశాల ప్రధాన హోమాలు, వర్షవర్ధన దైవత్య హోమాలు జరిపారు. దేవదాయ శాఖ కమిషనరు కె.రామచంద్రమోహన్, చిట్టూరి వీర వెంకట సత్యనారాయణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.





ఆలమూరులో చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ (ఫైల్‌ఫొటో). పక్క చిత్రంలో తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీవో రాజు తదితరులు

గ్రామాల్లో చెత్తపై సమరం

• తడిపొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన • రామచంద్రపురం డివిజన్‌లో ఐవీఆర్‌ఎస్‌కు 88 గ్రామ పంచాయతీల ఎంపిక • చెత్త సేకరణలో ఇబ్బందులు తప్పేదెలా?

ఆలమూరు, మే 18(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాల్లో చెత్తపై సమరం మొదలైంది. ఆయా పంచాయతీలకు ఇటీవల చెత్త సమస్య పెద్ద సమస్యగా మారింది. చెత్త నుంచి సంపద సృష్టించి ఆదాయ వనరులుగా మార్చవచ్చునన్న ప్రభుత్వ నిర్ణయంతో గ్రామాల్లో చెత్తపై సమరం జరుగుతోంది. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి తడి,పొడి చెత్త సేకరణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని రామచంద్రపురం డివిజన్‌లో నాలుగు నెలలుగా యజ్ఞంలా సాగుతోంది. రామచంద్రపురం డివిజన్ పరిధిలో రామచంద్రపురం, మండపేట, కొత్తపేట నియోజకవర్గాలకు సంబంధించిన తొమ్మిది మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 151 పంచాయతీ ఉన్నాయి. దీనిలో మొదటి విడతగా ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్)కు 65 గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. క్రమంగా వీటిని 88 గ్రామాలకు విస్తరించింది. ఎంపిక చేసిన పంచాయతీల్లో తడి,పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి ఆయా గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణకు సంబంధించి ఇంటింటికి అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా సేకరించిన చెత్తను పలు రకాలుగా విభజించి వాటిని విక్రయించడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం లభిస్తుందని సూచిస్తున్నారు. పంచాయతీలకు, పారిశుధ్య కార్మికులను అదనంగా ఏర్పాటు చేసుకోవడానికి వనరులు ఏర్పడతాయని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లు, పారిశుధ్య కార్మికులకు ఇటీవల అవగాహన కల్పించారు.

ప్రజల నుంచి నేరుగా అభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు : ఐవీఆర్ఎస్‌కు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రభుత్వం నేరుగా ఇంటి యజమానులకు ఫోన్ చేసి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకునే ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణ ఎలా జరుగుతోంది, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు ఎలా ఉందనే అంశాలను ప్రభుత్వం నేరుగా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఆయా పంచాయతీ అధికారులు కృషి చేస్తున్నారు.

చెత్త ద్వారా అదనపు ఆదాయం

ఎ.రాజు, డీఎల్‌డీవో రామచంద్రపురం డివిజన్



డివిజన్ పరిధిలో 151 గ్రామాలకు ప్రస్తుతం 88 గ్రామాల్లో ఐవీఆర్ఎస్‌కు ఎంపిక చేశాం. ఆయా గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా సంపద సృష్టించి పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఐవీఆర్ఎస్ గ్రామాలుగా ఎంపిక చేసిన చోట పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు ఉన్నా, వాటిని అధిగమించి చెత్త సేకరణ జరుగుతుంది. భవిష్యత్తులో ఆదాయం పెరుగుతుంది. పంచాయతీలకు ఆర్థిక ఇబ్బందులు ఉండవు. ముఖ్యంగా పంచాయతీలు ఆయా గ్రామాల్లో అదనపు సిబ్బందిని నియమించుకునేలా ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.





రామచంద్రపురం నియోజకవర్గ మహానాడులో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ. వేదికపై రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• హోరెత్తిన మహానాడు సభ • హాజరైన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ • కడప పరిశీలనకు వెళ్లిన మంత్రి సుభాష్

ద్రాక్షారామ (రామచంద్రపురం), మే 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పేర్కొన్నారు. టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ఆదివారం రామచంద్రపురంలోని లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన రామచంద్రపురం నియోజకవర్గస్థాయి మహానాడు సభ జరిగింది. ముఖ్య అతిథి, పార్టీ పరిశీలకుడిగా హాజరైన గన్ని కృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. మరో ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ శాసనసమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెల 22న అమలాపురంలో జరిగే పార్లమెంటు స్థాయి మహానాడును విజయవంతం చేయాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తన తనయుడు, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్ మహానాడు ఏర్పాటులో పరిశీలనకు కడప వెళ్లాల్సి రావడంతో ఈ సభకు హాజరు కాలేకపోయారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన నియోజకవర్గస్థాయి మహానాడు సభలో టీడీపీ సీనియర్ నాయకుడు రాజగోపాల నర్సరాజు (గోపాలబాబు), చింతపల్లి వీరభద్రరావు, పార్టీ నగర అధ్యక్షుడు కడియాల రాఘవన్, నాయకులు గరికపాటి సూర్యనారాయణ, అక్కల రిశ్వంత్‌రాయ్, నెక్కంటి బాలకృష్ణ, పెంకే సాంబశివరావు, కొత్తపల్లి శ్రీనుతో పాటు నియోజకవర్గంలోని టీడీపీ అనుబంధ సంస్థల అధ్యక్షులు, నేతలు పాల్గొన్నారు. తొలుత టీడీపీ నేతలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండపేట మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

ప్రజల నమ్మకాన్ని నిలబెడతా

మండపేటలో మినీ మహానాడులో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, మే 18 (ఆంధ్రజ్యోతి):తనపై నమ్మకం ఉంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలుపుకుంటానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆదివారం మండపేటలో మినీ మహానాడు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అథోగతిపాలు చేశారన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధిపథంలో నడవాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలు కూటమికి విజయాన్ని అందించారన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు గ్యాస్ సిలెండర్లు, ఆగస్టు 15 నుంచి అమలు చేసే ఉచిత బస్సు పథకంతోపాటు త్వరలో అమలు చేసే అమ్మకు వందనం తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీవీ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాలదొర తదితరులతో పాటు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాచీన వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు

మామిడికుదురు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆదుర్రు బౌద్ధ స్తూపం వద్ద బుద్ధ పౌర్ణమి సందర్భంగా ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదుర్రు బుద్ధవిహార్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం బౌద్ధ స్తూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బౌద్ధ భిక్షువులు సంఘపాల, విజయానంద, బంతే అబయబోధి, సత్యబోధిలు పాల్గొని దమ్మ సందేశాన్ని ఇచ్చారు. బౌద్ధ స్తూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పూజలు చేసి స్తూపం చుట్టూ తిరుగుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతీ ఒక్కరూ బుద్ధుడు సూచించిన మార్గంలో పయనించాలని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బౌద్ధ స్తూపం వద్ద అనేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధవిహార్ ట్రస్టు ఫౌండర్ మెంబర్ ఎస్ఎస్ఆర్ భూపతి, అధ్యక్షుడు చింతా శ్రీరామమూర్తి, బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు.



ఆదుర్రు బౌద్ధ స్తూపం వద్ద ప్రార్థనలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, మే 18(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేసవి సెలవులు కావడంతో పుణ్యక్షేత్రంలో ఉన్న ఆలయాలను సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సందర్శించారు. సాయంత్రం వేళ సాగరసంగమం, బీచ్, లైట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో భక్తులు, పర్యాటకులు సందడి చేశారు.



బాలభానుకు డాక్టరేట్

అమలాపురం రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం భట్నవిల్లికి చెందిన ఆకెళ్ల బాలభానుకు ఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. మహిళా శతావధానిగా 215 అష్టావధానాలు, 3 శతావధానాలు, ఒక ద్వి శతావధానం చేసిన ఆమెకు ఈ పురస్కారం లభించింది. అవధాన రంగంలో, సాహిత్య రంగంలో ఆమె చేసిన కృషిని గుర్తించి ఢిల్లీలోని కళమంచి ఆడిటోరియంలో వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దోమన చిన్నారావు ఆధ్వర్యంలో బాలభానుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పలువురు అతిథులు పాల్గొని ఆమె అవధాన రంగంలో చేస్తున్న కృషిని ప్రశంసించారు.